క్లుప్తంగా

ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం



శ్రీఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేసేందుకు వేచి ఉన్న భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం అనంతరం అమ్మవారికి భక్తులు జలాభి షేకం చేశారు. ఆలయ ఈవో జి.రమాబాయి ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాసరావు, కె.వి.కె. శాస్త్రి భక్తుల గోత్రనామాలతో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ప్రతి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అమ్మవారికి పసుపు నీళ్లతో జలాభిషేకం చేయడం ద్వారా తమ కోర్కెలు నెరవేరుతాయని భావిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు. సాయంత్రం కూడా అమ్మవారికి జలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, ట్రస్టు బోర్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

వివేకానంద ఆశ్రమ వాసులకు ఆరోగ్య పరీక్షలు



వృద్ధులకు ఉచితంగా మందులు అందజేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్

దాబాగార్డెన్స్ : పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ ఆశ్రమ వాసులకు బుధవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఏఎస్ టీచ్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ నేతృత్వంలో పలువురు వైద్యులు ఈ పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ చెకప్, ఈసీజీ చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జహీర్ అహ్మద్ మాట్లాడుతూ వేసవి తీవ్రత ఎక్కువ కానున్న దృష్ట్యా వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని, సమయానికి మందులు వాడాలని, తగిన శారీరక వ్యాయామం చేయాలని, ఆహార నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ముస్తాఫ్ అహ్మద్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులను నెట్టేయడం దారుణం'

దాబాగార్డెన్స్ : విజయనగరం జిల్లాలో గల మహారాజ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (మిమ్స్) ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికులు తమ సమస్యలు పరిష్కరించమని నెల రోజులుగా పోరాడుతుంటే యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తూ 350 మంది కార్మికులను బయటికి నెట్టివేసిందని సిటు రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావు ఆరోపించారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం యూనియన్ పెట్టుకున్నారనే అక్కసుతోనే వారిని నెట్టివేశారని దుయ్యబట్టారు. అధికారులు యాజమాన్యంతో కుమ్మక్కై కార్మికుల పొట్టలు గొడుతున్నారని ఆరోపించారు. మిమ్స్ యాజమాన్యం మొండి పట్టుదలకు పోకుండా కార్మికులతో చర్చలు జరిపి తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ పోరాటానికి రాష్ట్ర వ్యాప్తంగా గురువారం సంఘీభావం తెలపాలన్నారు.

జగనన్న సురక్షతో.. ఆరోగ్య భద్రత

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలు ఖరీదైన పరీక్షలు, వైద్యం ఉచితంగా పొందగలుగుతున్నారు. తన పాలన ద్వారా అభివృద్ధి, సంక్షేమం పేదలకు అందజేస్తున్న సీఎం తమకు మెరుగైన వైద్యం అందజేయాలని తపిస్తున్న తీరుకు పేదలు ముగ్ధులవుతున్నారు. పది కాలాల పాటు ఆయన పాలన కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు.



రోగులను పరీక్షిస్తున్న భీమ్‌నగర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మహలక్ష్మి

- భీమ్‌నగర్ డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో 480 మందికి పరీక్షలు.. చికిత్స
- సేవలందించిన గైనకాలజీ, ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు



పోషకాహారంపై లబ్ధిదారులకు వివరించేందుకు సిద్ధంగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అల్లిపురం : ప్రజారోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీర్చిదిద్దిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతో మంది పేదలకు బాసటగా నిలుస్తోంది. జీవీఎంసీ 34వ వార్డు అచ్చియ్యమ్మపేట సచివాలయం పరిధిలో సర్వేలో ఎంపికైన వారికి బుధవారం భీమ్‌నగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో లబ్ధిదారులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మరింత మెరుగైన వైద్యం అవసరమైన వారికి కేజీహెచ్‌కు సిఫారసు చేశారు. శిబిరంలో మొత్తం 480 మంది వైద్య సేవలు పొందారు. వారికి పరీక్షల అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో భీమ్‌నగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మహలక్ష్మి, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ రాకేష్, గైనకాలజిస్ట్ డాక్టర్ శిరీష, ఆస్పత్రి సిబ్బంది సేవలందించారు.

పోషకాహారంపై అవగాహన..

గర్భిణులు, బాలింతలు, మహిళలకు అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. చిరుధాన్యాలు, రాగి పిండి, పాలు వంటి వాటి ప్రయోజనాలపై అవగాహన కలిగించారు. ప్రతి రోజు ఒక గుడ్డు తీసుకోవాలని తెలిపారు. మునగాకు, తోటకూర, బచ్చలికూర తరచూ తీసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి సమగ్రంగా వివరించారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



పేర్లు నమోదు చేయించుకుంటున్న లబ్ధిదారులు

భారీ మెజారిటీ సాధించాలి

- డోర్ టు డోర్ పర్యటించండి
- సమన్వయ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్ : నియోజకవర్గంలో 60 శాతం ఓటింగ్ ఉన్నప్పటికీ అన్ని వర్గాల వారిని ఆకర్షించే విధంగా పని చేయాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సూచించారు. ఆశీల్‌మెట్ట సమీపాన గల ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం నియోజకవర్గం ముఖ్య నేతలతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డోర్ టు డోర్ పర్యటన చేయాలని, అక్కడి లోపాలు సరిదిద్దాలని సూచించారు. వ్యతిరేకత ఉన్న చోట కారణాలు తెలుసుకుని అక్కడి ఓట్లను కూడా ఆకర్షించాలన్నారు. వార్డుకి 250 మంది పార్టీలో చేరే విధంగా యూత్‌ని, నూతనంగా నమోదు చేసుకున్న ఓటర్లను కలుపుకోవాలన్నారు. గతం కన్నా భారీ మెజార్టీతో వైఎస్సార్‌సీపీ జెండా విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ఎగురవేయాలని పిలుపునిచ్చారు. తన అవసరం ఉంటే నేరుగా తానే వస్తానని వెల్లడించారు. సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే మన లక్ష్యమన్నారు. ముఖ్యంగా ఓటు శాతం పెంచే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వాసుపల్లి సూచించారు. సమావేశంలో పలువురు కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, పలు ఆలయాల చైర్మన్లు, డైరెక్టర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మనుగడకు మూలం.. సైన్స్



ఆల్విట్ స్కూల్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు



ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులు ప్రదర్శిస్తున్న ప్రాజెక్టులు

- సైన్స్‌డే సందర్భంగా పలు పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు
- నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టిన విద్యార్థులు

అల్లిపురం : ప్రభుత్వ విశాఖ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు అంశాలపై ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ వై.లక్ష్మి అధ్యక్షత వహించారు. సమావేశంలో కో ఆర్డినేటర్ డాక్టర్ బి.కల్యాణరాము, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ శరణ్య, ఫిజిక్స్ విభాగాధిపతి అరుణపద్మ, డాక్టర్ శరణ్య, కళాశాల అధ్యాపకులు డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ ఎ.హైమావతి, బి.హైమావతి, నాగలక్ష్మి, డాక్టర్ లక్ష్మణ్‌నాయుడు, నాగవేణి, సునీల్ విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ లేనిదే విశ్వం లేదు..

సైన్స్ లేకుంటే విశ్వమే లేదని ఆంధ్రా యూనివర్సిటీ భౌతిక శాస్త్ర విభాగం హెచ్‌వోడీ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మిస్సెస్ ఏవీఎన్ కళాశాల, సెట్విస్ యువజన సర్వీసుల విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాంకేతిక విప్లవానికి, మానవాళి మనుగడకు సైన్స్ ప్రధాన కారణమన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విస్ మేనేజర్ సూర్య ప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు, డీన్ జి. శంకర్‌నారాయణ, కళాశాల విభాగాధిపతులు, లెక్చరర్లు డాక్టర్ పి.గాంధీ, డాక్టర్ ఎ. అర్చన, ఎం.స్వరాజ్యలక్ష్మి, డాక్టర్. టి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. సెట్విస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

దాబాగార్డెన్స్ : ప్రపంచంలో సమస్త జీవరాశుల మనుగడకు సైన్సే మూలమని ప్రముఖ సైన్స్ ఉపాధ్యాయుడు, ఆల్విట్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఆచారి తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో పిల్లలు రూపొందించిన పలు ప్రాజెక్టులను ఆయన తిలకించి విద్యార్థులను అభినందించారు.



ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మి



ఏవీఎన్ కాలేజీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

ఇందిరాగాంధీ కాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- ఎమ్మెల్యే వాసుపల్లి సొంత నిధులతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ శ్రీకన్య థియేటర్ పక్కన గల ఇందిరాగాంధీ కాలనీలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తన సొంత నిధులతో పలు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే ప్రతీవారం నిర్వహించే ప్రజాదర్బార్‌లో వస్తున్న వినతుల పరిష్కారంలో భాగంగా ఈ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీల పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ కాలనీలో నివసిస్తున్న పేదల కష్టాలు తెలిసిన నేతగా తన వంతు సహాయం చేస్తున్నట్లు తెలిపారు. గతంలో రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి నేతృత్వంలో ఈ కాలనీ అభివృద్ధికి నాంది పడిందన్నారు. కాలనీ వాసుల కోరకుంటే ఇదే ప్రాంతంలో జీ ప్లస్ త్రీ తరహా ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు లేదా ఇళ్ల పన్నులు వేయించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డితో గానీ జీవీఎంసీ అధికారులతో గానీ తాను సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు వారంలోనే పూర్తి చేయించి నివాసులకు అసౌకర్యం కలుగకుండా చూస్తానని వాసుపల్లి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాసరావు, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యులు షరీఫ్, స్టేట్ డైరెక్టర్ ఎస్.ప్రసాదరావు, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, కాలనీ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

జీవో 16 విడుదలపై హర్షం

దాబాగార్డెన్స్ : పోరాటాల ఫలితంగా జీవో 16ను ప్రభుత్వం విడుదల చేయడంపై ఎయిడెడ్ స్కూల్స్ కరస్పాండెంట్లు హర్షం వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఎయిడెడ్ స్కూళ్లలో పనిచేస్తూ గుర్తింపు పొందేందుకు ఎదురు చూస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించడంపై ప్రైవేట్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ ప్రతినిధి పి.సునీతాకుమారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇంత వరకు ఏ ప్రభుత్వం తమను గుర్తించిన పాపాన పోలేదన్నారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యపై అవగాహన



పిల్లలకు పలకలు అందిస్తున్న బుల్లయ్య కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–1 విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం కళాశాల సమీపంలోని రేసపువానిపాలెంలో పిల్లలకు పలకలు, నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. విద్య ఆవశ్యకత, విద్యతో కలిగే ఉన్నతిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.శివజ్యోతి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి పాల్గొన్నారు.

మహాపాద యాత్రకు మద్దతు పలకాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరసింగరావు

దాబాగార్డెన్స్ : మోదీ ప్రైవేటీకరణ విధానాలకు నిరసనగా మార్చి 3న నిర్వహించనున్న మహాపాద యాత్ర విజయవంతం చేయాలని సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు. బుధవారం సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్‌తో కలిసి మీడియా సమావేశంలో నరసింగరావు మాట్లాడారు. మార్చి 1న మోదీ విశాఖ పర్యటనకు వస్తారని చెప్పినా ముఖం చెల్లక తన పర్యటన వాయిదా వేసుకున్నారన్నారు. స్టీల్ ప్లాంట్ రక్షణకు మార్చి 3 ఉదయం 6 గంటలకు కూర్మన్నపాలెం దీక్షా శిబిరం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గల శిబిరం వరకు నిర్వహించే మహా పాదయాత్రకు ప్రజలు, కార్మికులు పెద్ద ఎత్తున సంఘీభావం తెలపాలన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని, ప్లాంట్‌ను అభివృద్ధి పరుస్తామని చెప్పడం ఎంత వరకు కరెక్ట్ అన్నారు. ఇదే ప్రకటన ప్రధాని ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు.

నిలువెత్తు అభిమానం..

- మహానేత వైఎస్సార్.. సీఎం జగన్ పట్ల విధేయత చూపుతున్న యువకుడు
- సొంత నిధులతో సేవా కార్యక్రమాలు



తన ద్విచక్రవాహనంపై నవరత్నాల పెయింటింగ్స్‌తో రామకృష్ణ (ఫైల్)

దాబాగార్డెన్స్ : అభిమానాలు.. మమకారాలు.. అభినందనలు.. ధన్యవాదాలు.. కృతజ్ఞతలు.. తరచూ ఇటువంటి వ్యాఖ్యలు వింటుంటాం. ఓ మనిషి ఆవేదనతో ఉన్నాడంటే ఓదార్చడం.. విజయం సాధించాడంటే అభినందించడం సర్వసాధారణమే. అలాగే నచ్చిన వారి పట్ల ఇష్టం పెంచుకోవడం.. వారి కోసం ఏదైనా చేయడం కూడా తెలిసిందే. జగన్‌మోహన్‌రెడ్డి అన్నా.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నా.. ఎనలేని ప్రేమను పెంచుకున్నారు ఆ యువకుడు. నగరానికి చెందిన అతను వృత్తిరీత్యా కువైట్‌లో ఉంటున్నారు. రానున్నది ఎన్నికల కాలం. అభిమాన నేతను ఎలాగైనా గెలిపించుకోవాలన్న తపన ఆ యువకుడిది. అతనే వేగి రామకృష్ణ. 2019 ఎన్నికల సమరంలో తన ద్విచక్ర వాహనంపై జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసే నవరత్నాలను చిత్రీకరించుకున్నారు. అనూహ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా 151 సీట్లు సాధించింది. ఆ విజయానికి రామకృష్ణ ఆనందం అంతా.. ఇంతా కాదు. ఎన్నికలు అయిపోయాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అక్కడితో రామకృష్ణ ఆగిపోలేదు. వృత్తిరీత్యా కువైట్‌లో ఉంటున్నప్పటికీ.. ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. తన అభిమాన నేతల కోసం ప్రతి ఏటా.. వైఎస్సార్ వర్ధంతి, జయంతిలతో పాటు ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి పదవి చేపట్టిన నాటి నుంచి ప్రతి ఏడాది ఆ రోజున.. అలాగే జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం రోజుల్లో సేవలందిస్తున్నారు. మహానేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి పేరిట నగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో వృద్ధులకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. వృద్ధులు.. నిరుపేదలకు అన్నదానం, దుప్పట్లు అందజేయడం వంటివి చేస్తున్నారు.

2019లో ప్రచారం ఇలా..

జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసే ప్రయత్నంలో భాగంగా తన వద్ద ఉన్న ద్విచక్ర వాహనంతోనే ప్రచారానికి శ్రీకారం చుట్టారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాలను (పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలు) తన ద్విచక్ర వాహనంపై పెయింటింగ్ రూపంలో తీర్చిదిద్దారు. వాహనానికి ముందు భాగంలోని డూమ్‌పై మహానేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి.. ఆ కిందనే జన హృదయనేత జగన్‌మోహన్‌రెడ్డి.. మడ్‌గేర్‌పై ఫ్యాన్ గుర్తు ముద్రించారు. ద్విచక్ర వాహనానికి కుడి వైపున.. పేదలందరికీ పక్కా ఇళ్లు.. జలయజ్ఞం.. రైతు భరోసాతో కూడిన పెయింటింగ్‌లు వేయించారు. బండికి ఎడమ వైపున వైఎస్సార్ ఆసరా.. వృద్ధాప్య పింఛన్ల పెంపు.. ఆరోగ్యశ్రీ.. ఉచిత విద్య.. ద్విచక్ర వాహనం వెనుక భాగాన నెంబర్ ప్లేట్‌పై అటు ఇటు మహానేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి.. జగన్‌మోహన్‌రెడ్డి.. ఆ కింద భాగాన వైఎస్సార్ ఫొటోలు పెట్టుకున్నారు. అలాగే పెట్రోల్ ట్యాంక్‌కు అటు..ఇటు జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ ఫొటోలు పెట్టుకుని దివంగత నేతపైన, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపైన తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు వేగి రామకృష్ణ.



వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా రామకృష్ణ పేరిట స్వామి వివేకానంద సంస్థలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్ (ఫైల్)

పేదల పెన్నిధి.. జగన్‌మోహన్‌రెడ్డికి జేజేలు..



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రతి ఏటా వృద్ధులకు అన్న సమారాధనతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. పేదల ముఖాల్లో చిరునవ్వులు పూయిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జేజేలు. తన చివరి శ్వాస వరకు పేదల కోసమే తాపత్రయపడిన మహానేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి అయితే.. తండ్రి బాటలో నడుస్తూ పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న జననేత జగన్‌మోహన్‌రెడ్డి. నేను కువైట్‌లో ఉంటున్నప్పటికీ స్నేహితుల ద్వారా ప్రేమసమాజం, స్వామి వివేకానంద సంస్థల్లో సేవా కార్యక్రమాలు ఇప్పటికీ నిర్వహిస్తూ వస్తున్నాను. రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం ఖాయం.

– వేగి రామకృష్ణ, కువైట్

అగ్రపీఠ పరిపాలనాధికారిగా డాక్టర్ పొలిమేర



బిషప్ డాక్టర్ మల్లవరపు ప్రకాష్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ పొలిమేర జయరామ్

దాబాగార్డెన్స్ : రోమన్ క్యాథలిక్ మిషన్ విశాఖ అగ్రపీఠ పరిపాలనాధికారిగా డాక్టర్ పొలిమేర జయరామ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మహారాణిపేటలో గల బిషప్ కార్యాలయంలో రోమన్ క్యాథలిక్ మిషన్ విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ మల్లవరపు ప్రకాష్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. 2012 నుంచి తనకు సహాయ సహకారాలు అందించిన విచారణ గురువులు, కన్య స్త్రీలు, క్రైస్తవ విశ్వాసులకు బిషప్ డాక్టర్ మల్లవరపు ప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ పొలిమేర జయరామ్ మాట్లాడుతూ అగ్రపీఠానికి పరిపాలన అధికారిగా బాధ్యతలు అప్పగించిన పోప్ ఫ్రాన్సిస్‌కు ధన్యవాదాలు తెలిపారు. బిషప్ డాక్టర్ పొలిమేర జయరామ్ 1992లో గురువయ్యారు. 2013లో ఏలూరు బిషప్‌గా బాధ్యతలు స్వీకరించారు. విశాఖ రోమన్ క్యాథలిక్ మిషన్ విశాఖ అగ్రపీఠానికి పరిపాలనాధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించినట్టు చెప్పారు. ఈ మేరకు పలువురు గురువులు, పలు చర్చిల ఫాదర్లు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఫాదర్లు జొన్నాడ జాన్ ప్రకాష్, బాలశౌరి, కోన జయరాజ్, పీపీసీ అధ్యక్షుడు ఎస్. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాలు ప్రారంభం



పార్వతీశ్వరుల ఉత్సవమూర్తులకు మంగళస్నానం చేయిస్తున్న దృశ్యం

సీతంపేట: సీతంపేటలో కొలువైన పార్వతీశ్వర స్వామి 34వ వార్షిక కల్యాణ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో రమాభాయి పర్యవేక్షణలో శైవగమ పండితుడు అయిలూరి శ్రీనివాస దీక్షితులు, ఆలయ అర్చకులు గంగవరపు శివాజీశర్మ, భాస్కరశర్మ నేతృత్వంలో పార్వతీశ్వరుల మంగళస్నానాలతో వేడుక మొదలైంది. వేద మంత్రాలు, మేళతాళాల మధ్య పార్వతీశ్వరుల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా మంగస్నానం జరిపించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 9.30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, అంకురార్పన, ధ్వజారోహణ సాయంత్రం 6 గంటలకు అంగరంగ వైభవంగా స్వామి వారి కల్యాణం జరుగుతుందని తెలిపారు. మార్చి 1న సాయంత్రం 6 గంటలకు మేళ తాళాలతో సారె ఊరేగింపు నిర్వహిస్తామని, భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కథలు మానవతా విలువలు పెంచాలి

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన కథా కచేరిలో ప్రముఖ రచయితలు చదివిన కథలు అందరినీ అలరించాయి. ముఖ్య అతిథి, కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు మాట్లాడుతూ కథానిక మానవతా విలువలను పెంచేదిగా ఉండాలన్నారు. వ్యక్తులకు సభ్యతా, సంస్కారం నేర్పేటట్టు ఉండాలని సూచించారు.

కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో అప్రెంటిస్ మేళా

మర్రిపాలెం: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సెంట్రలైజ్డ్ అప్రెంటిస్ మేళాను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ డైరెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాల మేరకు ఈ మేళా ఏర్పాటు చేశామన్నారు. బోర్డ్ ఆఫ్ అప్రెంటిస్ ట్రెనింగ్ సదరన్ రీజియన్(చెన్నై) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా సాంకేతిక విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎ.వి.రామకృష్ణ, వికాస్ (స్వచ్ఛంద సంస్థ) ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు, ఆశా సొసైటీ అధ్యక్షుడు మస్తాన్‌వల్లి అతిథులుగా విచ్చేశారు. అప్రెంటిస్ శిక్షణ ప్రాముఖ్యాన్ని అతిథులు వివరించారు. 14 ప్రముఖ సంస్థల సిబ్బంది 175 మంది అప్రెంటిస్ ట్రెనింగ్ అభ్యర్థులకు ఇంటర్వ్యూ చేశారు. మేళా విజయవంతానికి కేబీఎస్ఎస్ కుమార్, కళాశాల సిబ్బంది సహకరించారు. కార్యక్రమంలో బోర్డ్ ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రెనింగ్(బోట్) ఎస్ఆర్ చెన్నై అసిస్టెంట్ డైరెక్టర్ జి.ఎడ్వర్డ్ పాల్, హిందుస్థాన్ షిప్‌యార్డు మేనేజర్ డాక్టర్ సోమసుందరం పాల్గొన్నారు.